మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి



గూగుల్ మీట్ లో సమీక్షా చేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల జూన్ 06, ప్రభాతవార్త:** ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి సెన్సెస్, సాదా బైనామా, ఎస్ఐఆర్ అంశాలపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షి ంచారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ జూన్ 25 నుంచి ప్రారంభమవుతుందని ఈ లోగానే బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం పూర్తయ్యేలా రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడాలన్నారు. ఆయా పోలింగ్ స్టేషన్ల బూత్ లెవెల్ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించేలా పై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఉండాలన్నారు. అక్టోబర్ 1న ఫైనల్ ఓటర్ జాబితా ముద్రించి, ప్రకటించడం జరుగుతుందని, ప్రక్రియ మొత్తం సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. జనాభా గణన 2027 లో భాగంగా మొదట ఇండ్ల గణన చేపట్టినందున ఏ ఒక్క ఇంటిని వదలకుండా నిర్దేశిత సమాచారాన్ని సేకరించాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి వివిధ భూ సమస్యలపై ప్రజలు పెద్ద ఎత్తున కలెక్టరేట్ కు వస్తున్నారని, ఆయా మండలాల్లోనే సంబంధిత అధికారులు వారి సమస్యలను పరిష్కరించాల్సి ఉందన్నారు. పెండింగ్ లో ఉన్న సాదా బైనామాల పరిష్కారానికి మండలాల వారీగా సంబంధిత తహసిల్దార్లతో కలెక్టర్ మాట్లాడారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, సిపిఓ పాపయ్య, వివిధ మండలాల తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రియాంక

## ప్రభుత్వ బడులు ప్రతిభకు నిలయాలు

### నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట, జూన్6 ప్రభాతవార్త:** ప్రభుత్వపాఠశాలలు ప్రతిభకు నిలయాలని, వాటినాణ్యతను ప్రజలకు చేరవేసి విద్యార్థుల ప్రవేశాలను మరింత పెంచాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ప్రియాంక పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'ప్రభుత్వ బడిబాట భవితకు బంగారు బాట పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు నరసింహ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే లక్ష్యంతో రూపొందించిన ఈపోస్టర్ అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన, ఆధునిక బోధనా విధానాలు, డిజిటల్ టీవీ తరగతులు, ఇంగ్లీష్ మీడియం విద్య విస్తరణ, నో బ్యాగ్ డే వంటి కార్యక్రమాల అమలుతో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని ఆమె తెలిపారు. ప్రభుత్వ బడులపై ప్రజల్లో అవగాహన పెంచి, కొత్త ప్రవేశాలను ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా తపస్ అదనపు ప్రధాన కార్యదర్శి షేర్ కృష్ణారెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ గుంపు బాలరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచడం, ప్రభుత్వ బడులను మరింత పటిష్టం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కిషోర్ కుమార్, జిల్లా నాయకులు సీతారాములు, తిరుపతయ్య, శ్రీనాథ్, మహిళా విభాగం నాయకులు నర్మద, సౌభాగ్యలక్ష్మి, వెంకటమ్మ, కృష్ణవేణి, ప్రియాంక, మండల నాయకులు చిన్న నరసింహులు, వెంకటేష్, వాజ్‌పాయ్, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

## రైతులకు ఇబ్బంది లేకుండా వరి కొనుగోలు ప్రక్రియ

### నాగర్‌కర్నూల్ కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 6 ప్రభాతవార్త:** రాష్ట్రంలో వరి కొనుగోలు, సంక్షేమ పథకాల అమలును పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి అదనపు డి జి పి మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సి.పి.లు, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నీట్2026 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు, వరి ధాన్యం కొనుగోలు, జూన్ 9న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి సభ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 21వ తేదీన జరగనున్న నీట్2026 పరీక్షకు 24 పట్టణాలలో 208 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 72 వేల 956 విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఇప్పటి వరకు 10 లక్షల 58 వేల మంది రైతుల ఖాతాలలో 13 వేల 577 కోట్ల రూపాయల కనీస మద్దతు ధర జమ చేయడం జరిగిందని, మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన కొనుగోలు చేసి కొనుగోలు ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మండల మహిళా సమాఖ్యకు 1 చొప్పున 553 బస్సులను మంజూరు చేయడం జరిగిందని, ఈ బస్సులను జూన్ 9వ తేదీన సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా మహిళా సమాఖ్య సభ్యులకు లాంఛనంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లు, సభకు మహిళా సమాఖ్య సభ్యుల తరలింపుపై ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి అధికారులు, ఆర్ టి సి రీజినల్ మేనేజర్లు సమన్వయంతో పని చేసి సభను విజయవంతం చేయాలని తెలిపారు. జూన్ 12న రాష్ట్రంలోని పాఠశాలల పునః ప్రారంభానికి విద్యార్థులకు అందజేయవలసిన యూనిఫామ్ లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ హాజరై మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వర్షాల దృష్ట్యా కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచడం జరిగిందని, రవాణా సంబంధిత ఏర్పాట్లు చేయడం జరిగిందని, తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. 9వ తేదీకి మహిళల తరలింపు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలోని ఈనెల 12వ తేదీ నుండి ప్రారంభం కనుగొన్న పాఠశాలల పునః ప్రారంభానికి పకడ్బందీ ఏర్పాటు చేస్తామని పాఠ్యపుస్తకాలు ఏకరూప దుస్తులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. వర్షాకాలంలో తీసుకుని జాగ్రత్తల పట్ల కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అమరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి చిన్న ఓబులేసు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నరసింహారావు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రాజేందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మా ప్రకటనతోనే చలనం..



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

- రెండున్నరేండ్లలో తట్టెడు మట్టి తీయలే..
- 70 ఏళ్లలో పాలమూరును
- వలస జిల్లాగా మార్చారు..
- ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరులో
- 27వేల ఎకరాలకే సాగునీరు
- తెలంగాణ వచ్చాక ఆరున్నర లక్షల
- ఎకరాలకు నీళ్లు ఇచ్చాం..
- వలస జిల్లాకే వలసలు వచ్చేలా చేసాం..
- అధికారం ఎవరికి ఇవ్వాలో ప్రజలు నిర్ణయిస్తారు..
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి
- ఆంధ్ర అధికారిని తీసుకొచ్చి తెలంగాణ
- నీళ్లు తరలించే కుట్ర : మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 6 ప్రభాతవార్త :** ఉమ్మడి పాలమూరులో ప్రాజెక్టుల స్థితిగతులపై బిఆర్ఎస్ పాదయాత్ర చేస్తుందని ప్రకటించిన వెంటనే కాంగ్రెస్‌పార్టీలో చలనం వచ్చిందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రులు డా.సి.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, అంజయ్య యాదవ్, మాజీ ఎంపీ మన్నే శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్‌లు వాల్యా నాయక్, ఇంతియాజ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తాము పాదయాత్ర అనౌన్స్ చేసిన తరువాత ప్రభుత్వంలో చలనం వచ్చిందన్నారు. రెండున్నర ఏండ్లు ప్రభుత్వానికి టైమ్ ఇచ్చామని చెప్పారు. పాదయాత్ర ప్రకటనతో మంత్రులు, ముఖ్యమంత్రి ప్రాజెక్టును విజిట్‌చేశారని పేర్కొన్నారు. ప్రాజెక్ట్ పూర్తిపై కాంగ్రెస్ కు చిత్తశుద్ధి లేదని, నార్లపుర్ నుండి ఉద్దండాపూర్ వరకు సంవత్సరంలోపు పూర్తి చేస్తామన్నారని ఏమైందని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం ఉంటే ఆరు నెలల్లో కరివెన వరకు నీళ్ళు తీసుకువచ్చే వాళ్ళమన్నారు. అన్ని పనులు చేసాక మిగిలిన పనులు చేయడానికే ఇంకో ఏడాది అంటున్నారని, పాలమూరు ప్రాజెక్ట్‌కు 27000వేల ఎకరాలు భూసేకరణ చేశామని, సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ భూసేకరణ చేయలేదనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

**కాలువలకు బీఆర్ఎస్ పిలిచిన టెండర్లను రద్దు చేశారు..**

కేసీఆర్ ఎంపీగా ఉండి జిల్లాకు ఏం చేయలేదనడం ఏంటని ప్రశ్నించారు. డెబ్బై ఏండ్ల పాలనలో పాలమూరును వలసల జిల్లాగా పేరు తెచ్చారుని, పాలమూరు జిల్లాప్రాజెక్టులు అంటేనే పెండింగ్‌ప్రాజెక్ట్‌లుగా మార్చారని గుర్తు చేశారు. ఉమ్మడిరాష్ట్రంలో జిల్లాకు 27వేల ఎకరాల సాగునీరు అందేదని, బీఆర్ఎస్ వచ్చాక ఆరున్నరలక్షల ఎకరాలకు సాగునీరు అందించామన్నారు. ఈ జిల్లాను బాగుచేయాలని కేసీఆర్‌గారు అధిక ప్రాధాన్యం ఇచ్చారని, తెలంగాణ ఏర్పడ్డాక మొట్టమొదటి ప్రాజెక్ట్ పాలమూరులోనే శంకుస్థాపన చేశారని, కాంగ్రెస్ నాయకులు కానీ అనేక కేసులు వేసి అడ్డుకున్నారు.. రైతులను భూములు ఇవ్వొద్దని రెచ్చగొట్టారని, అయినప్పటికీ అన్ని అనుమతులు తీసుకొచ్చి ప్రాజెక్ట్ తొంభై శాతం పూర్తి చేశామన్నారు. వలసల జిల్లాకు ఐదు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామని, ఇతర రాష్ట్రాల నుండే ఇక్కడికి వలస వచ్చేలా చేసామన్నారు. ఉద్దండాపూర్ ప్రాజెక్ట్ డిజైన్ చేయడం, గ్రామస్తులను ఒప్పించి పనులు ప్రారంభించామని లక్ష్మారెడ్డి చెప్పారు. మూడు ప్యాకేజీలు 5500 కోట్లు ... నాలుగు వేలకోట్లు అప్పటికే రిలీజ్‌చేశామని, ఉద్దండాపూర్ రైతులకు ఎక్కువ పరిహారం ఇవ్వాలని లేట్‌గా స్టార్ట్ చేసినట్లు వివరించారు. 2019లో పనులు ప్రారంభించినం... అందులో రెండేళ్ళు కరోనాఉందని, రెండేళ్లలో ఐదువేలకోట్లు ఖర్చు పెట్టామన్నారు. రెండున్నర ఏండ్లలో ఆరువందలకోట్లు పరిహారం ఇచ్చి గొప్పగా చెప్పుకుంటున్నారని, మేము చేసిన పని ఏంటో జిల్లా మీడియాకు చూపిస్తాం అన్నారు. పాలమూరు ప్రాజెక్ట్ పనులు పూర్తి కాకపోవడానికి కాంగ్రెస్ నాయకులే కారణమని, బీఆర్ఎస్ రిజర్వాయర్‌లు కట్టింది.. అందుకే 90 టీ ఎం సీలు కాంగ్రెస్ అడుగుతుంది.. లేకపోతే అడగడానికి అవకాశం లేదు కదా అని క్లారిటీ ఇచ్చారు.

**తాము ఉద్యమ నాయకులం..**

తెలంగాణ రాష్ట్రం కోసం ,తెలంగాణ పునర్నిర్మాణం కోసం పని చేశామన్నారు. ప్రభుత్వం మంచిపని చేస్తే సహకరిస్తామన్నారు. కొడంగల్ ఓడిపోతే రాజకీయ సన్యాసం అన్నారు.. ఏమైందని ప్రశ్నించారు. ఇప్పుడు జెండా ఎగరనివ్వను అంటున్నారు.. అదంతా ప్రజలు చూసుకుంటారు.. ఎవరి జెండా ఎగరాలో అని హితవు పలికారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తట్టెడు మట్టి తీయలేదన్నారు. ప్రతిపక్షంలో ఉండి కాంగ్రెస్ కేసులు వేయించిందని, అధికారంలోకి వచ్చాక పనులు పెండింగ్ పెట్టిందన్నారు. జిల్లాకు జడ్చర్లకు ఏం ఒరగలే.. జడ్చర్లలో సభ పెడితే సీఎం ఏదైనా ఇస్తారని ఆశించారని, జడ్చర్లకు, జిల్లాకు ఒరిగిందేమీ లేదన్నారు. సభలో కేసీఆర్ ను తిట్టడానికి సరిపోయింది. ఇందుకేనా సభ పెట్టిందని ప్రశ్నించారు.

**ఆంధ్ర అధికారిని తీసుకొచ్చి తెలంగాణ నీళ్లు తీసుకునేందుకు కుట్ర**

**మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్**



బనకచర్ల గురించి అసలు ముఖ్యమంత్రి మాట్లాడలేదని, ఆదిత్యనాథ్ అనే అధికారిని తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ నీళ్ల తీసుకెళ్లేందుకు కుట్ర చేస్తున్నారని మాజీ మంత్రి వి శ్రీనివాస్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రెండు రోజుల పర్యటనలో జిల్లాకు ఒరిగింది ఏమిలేదని మాజీ మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఏదైనా వరాలు కురిపిస్తారని ప్రజలు ఆశించారని కానీ నిలిచిన పనులు పూర్తిచేసేందుకు నిధులు ఇవ్వకుండా బీఆర్ఎస్ పార్టీ పై విమర్శలు చేసారని పేర్కొన్నారు. పాలమూరు ప్రాజెక్ట్ ఎప్పుడు పూర్తి చేస్తామో కూడా స్పష్టంగా మీటింగ్ లో రేవంత్ రెడ్డి చెప్పలేదన్నారు. జూరాల పరిధిలో చెక్ డ్యామ్ కట్టేందుకు ఏరియాల్ సర్వే రేవంత్ రెడ్డి చేసారని, కర్ణాటక – మిగతా4లో..

# నీట్ పరీక్షకు సర్వం సిద్ధం

- జిల్లాలో పరీక్ష రాయనున్న
- 4291 మంది అభ్యర్థులు
- 13కేంద్రాలు ఏర్పాటు
- వీసీలో కలెక్టర్ కుష్బూ గుప్త
- నీట్ పరీక్ష ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ
- ప్రధాన కార్యదర్శి కె .రామకృష్ణారావు వీసీ



వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్త

**మహబూబ్‌నగర్ బ్యూరో జూన్ 6, ప్రభాతవార్త:** జిల్లాలో నీట్ పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లుచేసినట్లు మహబూబ్‌గర్ కలెక్టర్ కుష్బూ గుప్తా వీడియోకాన్ఫరెన్స్లో వివరించారు. రాష్ట్రంలో జూన్ 21న నిర్వహించనున్న నీట్2026 రీ ఎగ్జామ్ పరీక్షకు ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి అదనపు డిజిపి మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సి.పి.లు, ఎస్.పి.లు ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నీట్2026 రీ ఎగ్జామ్ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు, వరి ధాన్యం కొనుగోలు, జూన్9న సికింద్రాబాద్ పరేడ్‌మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి సభ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర, జిల్లా సమన్వయ కమిటీలు అందుకు అనుగుణంగా పని చేయాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులపై తక్షణమే స్పందించాలని, వదంతులు వ్యాప్తి కాకుండా చూడాలని తెలిపారు. ప్రభుత్వ సంస్థలలో మాత్రమే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, అంతర్జాతీయ యోగా దినోత్సవం దృష్ట్యా పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. పరీక్ష రోజున ప్రశ్న పత్రాల తరలింపు, అభ్యర్థుల రిజిస్ట్రేషన్, బయోమెట్రిక్ వెరిఫికేషన్, అభ్యర్థుల తనిఖీ, బందోబస్తు తదితర ఏర్పాట్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టాలని తెలిపారు. ఇప్పటి వరకు 10లక్షల58 వేల మంది రైతులఖాతాలలో 13వేల 577కోట్ల రూపాయల కనీసమద్దతు ధర జమచేయడం జరిగిందని, మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన కొనుగోలుచేసి కొనుగోలుప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తిచేసేలా చర్యలు తీసు కోవాలని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మండల మహిళా సమాఖ్యకు 1 చొప్పున 553 బస్సులను మంజూరు చేయ డం జరిగిందని, ఈ బస్సులను జూన్ 9వ తేదీన సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్స్‌లో రాష్ట్ర ముఖ్య మంత్రి చేతులమీదుగా మహిళా సమాఖ్య సభ్యులకు లాంఛనంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈసభకు సంబంధించిన ఏర్పాట్లు, సభకు మహిళా సమాఖ్య సభ్యుల తరలింపుపై ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి అధికారులు, ఆర్‌టిసి రీజినల్ మేనేజర్లు సమన్వయంతో పని చేసి సభను విజయవంతం చేయాలని తెలిపారు. జూన్ 12న రాష్ట్రంలోని పాఠశాలల పునః ప్రారంభానికి విద్యార్థులకు అందజేయవ లసిన యూనిఫామ్ లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. అదనపు డిజిపి మాట్లాడుతూ పరీక్షాకేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలకు ఎప్పటికప్పుడు స్పందించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళా అభ్యర్థుల తనిఖీలో మహిళ కానిస్టేబుల్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ జిల్లాలో 13 పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహబూబ్ నగర్ లో 12, జడ్చర్ల లో 1 పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు, పిడబ్ల్యుడి విద్యార్థులకు 6.15 గంటల వరకు నిర్వహించనున్న నీట్ పరీక్షకి 4291 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, ఏర్పాట్లను సంబంధిత శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపుకలెక్టర్ లోకల్‌బాడీస్ మధుసూదన్‌నాయక్, రెవెన్యూ అదనపుకలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, అదనపు ఎస్.పి. ఎన్.బి రత్నం, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ సురేందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి ధరావత్

## బాలల గొంతుక బాల పంచాయతీలు

### భవిష్యత్ నాయకుల తయారీకి నాంది

### బాలల భద్రతకు అందరూ తోడ్పడాలి

### జిల్లా ఎస్పీ డి.జానకి

**మహబూబ్‌నగర్, జూన్ 6 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక-99 రోజుల కార్యక్రమంలో భాగంగా బాలల భద్రత వారోత్సవాల సందర్భంగా శనివారం మహమ్మదాబాద్ మండలం నంచర్ల గేట్‌లోని పల్లవి గార్డెన్‌లో తెలంగాణ పోలీస్ విమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో, మై ఛాయస్ ఫౌండేషన్, యంగిస్తాన్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో బాల పంచాయతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ, బాలల హక్కుల పరిరక్షణ, భద్రత, వ్యక్తిత్వ వికాసం మరియు నాయకత్వ లక్షణాల అభివృద్ధికి బాల పంచాయతీలు సమర్థవంతమైన వేదికలుగా నిలుస్తాయని తెలిపారు. పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, పట్టుదల, బాధ్యతాయుత నిర్ణయాలు తీసుకునే సామర్థం, మానసిక పరిపక్వత, సమస్యలను విశ్లేషించి పరిష్కరించే నైపుణ్యం – మిగతా4లో..

# భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలి

### తెలంగాణ ఆర్అండ్ ఆర్ కమిషనర్ కే శివకుమార్ నాయుడు





సమావేశంలో మాట్లాడుతున్న ఆర్అండ్ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు, కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి, జూన్6 ప్రభాతవార్త:** జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్లో ఉన్న భూసేకరణ పనులు అత్యంత వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆర్అండ్ఆర్ కమిషనర్ కే.శివకుమార్ నాయుడు ఆదేశించారు. తెలంగాణ ఆర్అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు శనివారం వనపర్తి జిల్లాలో ఆకస్మికంగా పర్యటించారు. ఈపర్యటనలో భాగంగా ఆయన ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న పలు నీటిపారుదల ప్రాజెక్టుల భూ సేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ పాలమూరు ప్రాజెక్టుల విషయంలో భూసేకరణ పనులు పూర్తి చేయడం ప్రథమ ప్రాధాన్యతగా పనిచేయాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ఉమ్మడి పాలమూరు జిల్లా పర్యటనలో భాగంగా సూచించినట్లు తెలిపారు. ఆదిశగా జిల్లాలోని రెవెన్యూ, నీటి పారుదల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రాజెక్టులకు కీలకమైన ప్రాంతాల్లో భూసేకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్ అండ్ ఆర్ కమిషనర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ఆదేశాల అనుసారంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని జిల్లాల్లో పర్యటించి నీటిపారుదల ప్రాజెక్టులపై సమీక్షి ంచడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. జిల్లాలో గణపసముద్రం ప్రాజెక్టులో భాగంగా పెండింగ్లో ఉన్న 197 ఎకరాల భూసేకరణకు గాను 164 ఎకరాలకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని, రైతులను ఒప్పించి అవార్డు కూడా త్వరగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా కర్నె తాండ లిఫ్ట్ ఇరిగేషన్ కు సంబంధించి పెండింగ్ 17 ఎకరాల భూసేకరణకు సంబంధించి సోమవారంలోగా ప్రతిపాదనలు పంపాలని నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశించారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద ప్యాకేజ్ 29 కు సంబంధించి మైనర్ కెనాల్స్ 77 ఎకరాల భూసేకరణకు పెగ్ మార్కింగ్ త్వరగా పూర్తిచేసి ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. ఘనపూర్ బ్రాంచ్ కెనాల్ కు సంబంధించి 30 ఎకరాల భూమికి సంబంధించి పెగ్ మార్కింగ్ పూర్తిచేసి, ఎస్ డి ఆర్ స్టేజి లో ఉన్న 60 ఎకరాలకు కూడా త్వరగా నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశించారు. బుద్ధారం పెద్ద చెరువుకు సంబంధించి నోటిఫికేషన్ జారీచేసిన 101 ఎకరాల భూమికి సంబంధించిన రైతులతో మాట్లాడి అవార్డు వేగంగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఖాన్ చెరువుకు సంబంధించి చందాపూర్, సవాయిగూడెం, పెద్దగూడెం గ్రామాల పరిధిలో అటవీ భూమి అంశంపై అటవీశాఖ అధికారులతో సమన్వయం చేసుకొని పర్వేష్ పోర్టల్ లో త్వరగా అనుమతులు పొందే విధంగా చూసుకోవాలన్నారు. ఇప్పటికే జిల్లాలో భూసేకరణలో భాగంగా అవార్డ్స్ జారీ చేసిన వాటికి సంబంధించి టోకెన్స్ రైస్ చేస్తే త్వరితగతిన నగదు బదిలీ అయ్యే అవకాశం ఉంటుందని తెలియజేశారు. సమావేశంలో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ రహీముద్దీన్ , ఎస్ ఈ చంద్రశేఖర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, సర్వే ఏడి శ్రీనివాసులు, ఇతర రెవెన్యూ అధికారులు, ఇతర నీటిపారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిషేధిత పట్టణంగా మార్చుకుందాం


బ్యాగులను పంపిణీ చేస్తున్న దృశ్యం

**అచ్చంపేట, జూన్ 6 (ప్రభాతవార్త):** ప్లాస్టిక్ నిషేధిత పట్టణంగా మార్చుకునేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ మురళి అన్నారు. శనివారం 20వ వార్డు మాజీ కౌన్సిలర్ రమేష్ రావు అధ్యక్షతనలో ఏర్పాటుచేసిన వాళ్ల గ్రామ సభకు ముఖ్య అతిథి మున్సిపల్ కమిషనర్ హాజరై మాట్లాడారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలపై వార్డు సభలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత, నీటి సంరక్షణ, ఇంకుడు గుంతలు ఘన వ్యర్థ నివారణ వార్డులో ఉన్న సమస్యలపై ఈ వార్డు సభ నిర్వహించినట్లు తెలిపారు. పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చేందుకు మాజీ కౌన్సిలర్ రమేష్ రావు అల్లికలతో తయారు చేసిన బ్యాగులను కాలనీవాసులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఖాదర్ పాషా, 12వ వార్డు మాజీ కౌన్సిలర్ ఖాజాబీ, లక్ష్మణ్ బాబు, కో ఆప్షన్ నెంబర్ షమీం, వార్డ్ ఆఫీసర్ గణేష్, కావ్య, తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో సబ్సిడీ జీలుగ విత్తనాలు

**గోపాల్‌పేట మండల వ్యవసాయ అధికారి**

**గోపాల్‌పేట జూన్ 06 ప్రభాతవార్త :** గోపాల్‌పేట మండల పరిధిలోని రైతులందరికీ మండల వ్యవసాయ అధికారి ఒక ముఖ్యమైన ప్రకటన చేశారు. మండలంలోని ప్రాథమిక సహకార సంఘం (సింగిల్ విండో) మరియు ఆగ్రో రైతు సేవ కేంద్రం (గోపాల్‌పేట) నందు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి తెలిపారు. రైతులకు ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం వీటిని భారీ సబ్సిడీతో అందిస్తోంది. ఈ విత్తనాల ధరల వివరాలు కింది విధంగా ఉన్నాయి: జీలుగ విత్తనాల ధరల వివరాలు మొత్తం ధర (30 కిలోల బస్తా) రూ.4,905,50 శాతం సబ్సిడీ రూ.2,452.50రైతు చెల్లించవలసిన నికర ధర రూ.2,452.50లు. ముఖ్య గమనిక జీలుగ విత్తనాలు కావలసిన మండల రైతులు తమ యొక్క పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు మరియు బ్యాంకు ఖాతా జిరాక్స్ ప్రతులను తీసుకొని, తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులను (ఏవో) సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కోరారు.

## తహసీల్దార్‌కు రైతు సంఘం వినతిపత్రం


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**దామరగిద్ద, జూన్ 6 (ప్రభాతవార్త):** వర్షాకాల ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉంచాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం దామరగిద్ద మండల కమిటీ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ డీఏపీఎరువు బస్తా ధరను రూ.1,350కే అందించాలని, ఇటీవల పెరిగిన ఎరువుల ధరలను తగ్గించాలని కోరారు. ప్రస్తుతం కొత్త స్టాక్ రాకముందే పాత స్టాక్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. డీఏపీ బస్తాను రూ.1,650 నుంచి రూ.2,000 వరకు విక్రయిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. అలాగే కందులు, పెసర్లు నాలుగు కిలోల విత్తన బస్తా గత ఏడాది రూ.450 నుంచి రూ.500 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.700 నుంచి రూ.750 వరకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఎరువులు, విత్తనాల ధరలను నియంత్రించి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దింటి తాయప్ప, శాఖ బాల్‌రాజ్, కంసాన్‌పల్లి మల్లప్ప, లింగడిపల్లి అనంతమ్మ, బాపనపల్లి నరసప్ప, ఉడుములగిద్ద అలీసా తదితర రైతులు పాల్గొన్నారు.

## ఎరువుల సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు


ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి

**ఆత్మకూర్ జూన్6, ప్రభాతవార్త :** రాబోయే ఖరీఫ్ సీజన్లో రైతులకు ఎరువుల సరఫరా విషయంలో ట్రేడర్లు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వనపర్తి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు ఎరువులు డీలర్లను హెచ్చరించారు. శనివారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని శ్రీరామ ఎరువుల దుకాణంతోపాటుగా పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల షాపులను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియా పంపిణీ విషయంలో ఆన్లైన్ విధానంలో పంపిణీ చేసే పద్ధతి రూపొందించిన నేపథ్యంలో రైతులకు అర్థమయ్యే విధంగా ఎరువుల దుకాణాల డీలర్లు వ్యవహరించాలని రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అపేక్షించబమని ఆయన హెచ్చరించారు. ప్రతినిత్యం ఎరువుల దుకాణంలో ఆయా సంబంధిత ఎరువుల లిస్టును బోర్డులపై ఉంచడమే కాకుండా రైతులకు అందుబాటులో ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ తాసిల్దార్ జెకే మోహన్, ఆత్మకూరు మండలం వ్యవసాయ అధికారి రమేష్ నాయక్, తదితరులతో పాటుగా పోలీసు సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


**వెల్దండ, జూన్ 06 ప్రభాతవార్త:** ప్రభుత్వం లబ్ధిదారులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కృష్ణయ్య అన్నారు. వెల్దండ మండలంలోని తిమ్మినోనిపల్లి రాచారు, కేస్లీతండా, మర్రిగుంతతాండ, చౌదర్‌పల్లి, రాఘాయిపల్లి, పలుగుతాండ, శంకర్‌కొండ తాండ గ్రామాల్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామసభలను ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణయ్య పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. గ్రామ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్, సర్పంచులు సుంకిరెడ్డి కృష్ణారెడ్డి, శారద, హరికిషన్‌నాయక్, రమేష్‌నాయక్, శ్రీనునాయక్, గున్నేల శ్రీనివాస్, రవీందర్‌నాయక్, సామ వెంకటయ్యతో పాటు ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శిలు గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

## బడిబాటలో ఉపాధ్యాయులు


బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

**ఎర్రవల్లి జూన్ 6, ప్రభాతవార్త :** ఎర్రవల్లి మండల పరిధిలోని శాసనూలు గ్రామంలో శనివారము ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా వీరాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్ రెడ్డి శాసనూలు యుపిఎస్ ప్రధాన ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించాలని నాణ్యమైన విద్యతోపాటు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను గురించి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించారు విశాలమైన తరగతి గదులు, ఆట స్థలాలు, గ్రంథాలయాలు, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, నోట్ పుస్తకాలు, సాధన పుస్తకాలు, యూనిఫామ్స్, బస్ పాస్ లు ఉదయం అల్పాహారం మధ్యాహ్నం భోజన సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తున్నది. ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తే ఫీజులు కట్టలేక కుటుంబ పెద్దలు ఆర్థికంగా చితికి పోతారని, తల్లిదండ్రులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, పుల్లయ్య, శేఖర్, ముజీబ్ లు పాల్గొన్నారు.

## అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్దాం


గామ సభను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి మల్లేష్

**కోయిలకొండ జూన్6, ప్రభాతవార్త;** కోయిలకొండ మండలం మల్లాపూర్ గ్రామపంచాయతీని గ్రామస్తు లందరి సహకారంతో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని గ్రామ సర్పంచ్ పి.రవికుమార్ అన్నారు. శనివారం సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు ప్రత్యేకఅధికారిగా ఐకెపి సీసీ మల్లేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ గ్రామంలోని అన్ని వార్డులను శుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో మురుగునీరు లేకుండా చూసుకోవాలన్నారు. రోగాలు సంభవించకుండా ఎప్పటికప్పుడు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల న్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిపిఓ రఘు, పంచాయతీ కార్యదర్శి బాల్ రాజ్ , ఉప సర్పంచ్, వార్డు సభ్యులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

- మెరుగైన వైద్య సేవలు అందించాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్


మురుగు కాల్వ సమస్యలను పరిశీలిస్తున్న కలెక్టర్

**అచ్చంపేట, జూన్6 ప్రభాతవార్త:** ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శనివారం ఉదయం అచ్చంపేట పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. పట్టణంలోని శానిటేషన్ పనులు, ఇందిరమ్మ ఇళ్లనిర్మాణాల పురోగతి, ప్రభుత్వఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలు, పరిశీలించి అధికారులకు పలుసూచనలు చేశారు. మొదటగా పట్టణంలోని పలు వార్డుల్లో జరుగుతున్న శానిటేషన్ కార్యక్రమాలను కలెక్టర్ పరిశీలించారు. రహదారుల పరిశుభ్రత, చెత్త సేకరణ, డ్రైనేజీల నిర్వహణ, పారిశుధ్యకార్మికుల పనితీరును పరిశీలించి స్థానిక ప్రజలతో మాట్లాడారు. పట్టణం పరిశుభ్రంగా ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ పారిశుధ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో ఎక్కడా మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, డ్రైనేజ్‌పనులను పరిశీలించిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. అనంతరం అచ్చంపేట పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, నిర్మాణాల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా లబ్ధిదారులు త్వరగా ఇళ్లలోకి వెళ్లేలా పనులను వేగవంతంగా పనులను పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణ నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండకూడదని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సహాయం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని అన్నారు. తదనంతరం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన జిల్లా కలెక్టర్, ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రిలో నిల్వ ఉన్న మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, ఆసుపత్రి పరిశుభ్రత, మందుల వ్యాలిడిటీ తదితర అంశాలపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, పాముకాటు, కుక్కకాటుల మందులతో పాటు అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని వైద్యాధికారులను ఆదేశించారు. రోగులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సేవలు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వైద్యులు తప్పనిసరిగా ఆసుపత్రులకు సమయపాలన పాటించి రోగులకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ యాదగిరి, తహసిల్దార్ సైదులు, మున్సిపల్ కమిషనర్ మురళి, భీష్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ప్రభుత్వాసుపత్రిలోని మెడిసిన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

# ప్రత్యేక వార్డు సభలు విజయవంతంగా నిర్వహణ


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఎస్.అశోక్‌రెడ్డి

**వడ్డేపల్లి, జూన్ 06 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న 99 డేస్ యాక్షన్ ప్లాన్‌లో భాగమైన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం క్రింద మున్సిపాలిటీలలో వార్డు స్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యేక వార్డు సభలను నిర్వహిస్తున్నారు. ఈకార్యక్రమంలో భాగంగా వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలో శనివారం 5వ, 6వ వార్డులలో ప్రత్యేక వార్డు సభలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. సభల సందర్భంగా ఆయా వార్డుల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై తమ ప్రాంతాల్లో ఉన్న సమస్యలు, అవసరాలు మరియు అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. ముఖ్యంగా పారిశుధ్యం తాగునీటి సరఫరా వీధి దీపాల నిర్వహణ, మురుగు కాలువల అభివృద్ధి, రహదారుల మరమ్మతులు తదితర అంశాలపై తమ అభిప్రాయాలు, సూచనలు మరియు వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎస్.అశోక్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 99 డేస్ యాక్షన్ ప్లాన్ లక్ష్యాల సాధనలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. అలాగే ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2026, ఇంటి వద్దనే వ్యర్థాలను 4 రకాలుగా వేరు చేయడం, వర్షాకాల ముందస్తు సన్నద్ధత చర్యలు, పారిశుధ్య నిర్వహణ తాగునీటి సరఫరా వ్యవస్థ మెరుగుదల, మురుగు కాలువల పూడికతీత, ఎస్ఐఆర్ (సార్)వర్షపు నీటి సంరక్షణ, మొక్కల పెంపకం కార్యక్రమాలు మరియు ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.మంజుల ధర్మ, 5వ వార్డు కౌన్సిలర్ ఎన్. యుగంధర్ రెడ్డి, 6వ వార్డు కౌన్సిలర్ హెచ్. దేవమ్మ, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది మెప్మా సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించేందుకు ప్రత్యేక వార్డు సభలు సమర్థవంతమైన వేదికగా ఉపయోగపడుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ సభలకు ప్రజల నుండి మంచి స్పందన లభించడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## భట్టుపల్లి శివాలయానికి విరాళం


శివాలయానికి విరాళం చెక్కును అందిస్తున్న హైదరాబాద్‌కు చెందిన రేకులపాటి రామేశ్వర్‌రెడ్డి

**భూత్పూర్, జూన్ 6, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం భట్టుపల్లి గ్రామంలో గ్రామస్తులు నూతనంగా నిర్మిస్తున్న శివాలయం, శ్రీఅంజనేయస్వామి ఆలయానికి విరాళాల పరంపర కొనసాగుతోంది. పక్షం రోజుల క్రితం చేగుంటకు చెందిన సర్పంచి మల్లయ్యరు. లక్ష విరాళం అందించగా, తాజాగా శనివారం హైదరాబాద్‌కు చెందిన రేకలపాటి రామేశ్వర్‌రెడ్డి తన వంతు విరాళ, సహాయంగా రు.లక్షా 16వేల 116ల విలువ చేసే చెక్కును నూతన అలయ నిర్వహకులైన గ్రామ సర్పంచి రేకులపాటి లక్ష్మమ్మ భూపతిరెడ్డి, మాజీ సర్పంచి గోపాల్‌రాజులకు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వేముల సుదర్శన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, జయపాల్‌రెడ్డి, అంజనేయులుగౌడ్, గంగాధర్ పాల్గొన్నారు. తమ గ్రామ నూతన శివాలయానికి ఆర్థిక సహాయం విరాళంగా అందించిన రేకులపాటి రామేశ్వర్‌రెడ్డిని ఈ సందర్భంగా అభినందించి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## రేపు సోమవారం ప్రజావాణి రద్దు

**గద్వాల జూన్ 06, ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామ వార్డు సభల నిర్వహణ, ఎస్ ఐ ఆర్ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాలలో అధికారులు అందరూ పాల్గొంటున్నందున ఈనెల 8వ తేదీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలందరూ ఇట్టి విషయాన్ని గుర్తించి సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వచ్చి అసౌకర్యానికి గురి కాకూడదు అని కోరారు. ఈవారం తదుపరి వచ్చే సోమవారం ప్రజావాణి కార్యక్రమాలు యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు.

# పెంచిన ఎరువుల ధరలు తగ్గించాలంటూ ధర్నా..



ఎరువుల ధరలు తగ్గించాలంటూ ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ జూన్ 6, ప్రభాతవార్త :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన ఎరువుల ధరలపై తక్షరమే ధరలు తగ్గించాలంటూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో శనివారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరుపట్టణంలోని తాసిల్దార్‌కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ సహాయ కార్యదర్శి రాజన్న తదితరులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పంటలకు కనీస మద్దతు ధరలు ప్రకటించకపోవడం కాకుండా ములిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా బిజెపి మరియు యూరియా ధరలను పెంచి రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా తయారు చేస్తున్నారని వారు తీవ్ర స్థాయిలో ఆరోపించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు రైతుల పండించిన పంటలకు 50 శాతం మద్దతు ధర ప్రకటించడమే కాకుండా రైతులకు అవసరమైన మేర ఎరువులను విత్తనాలను అందుబాటులో ఉంచి సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎరువులధరలు పెరగడానికి ప్రధానకారణం అసమానతలతో కూడిన అమెరికా భారత్ వాణిజ్యఒప్పంద కార్యక్రమంలో భాగంగానే రైతులు నష్టపోవాల్సి వస్తుందని కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరల పెరుగుదలకు నైతిక బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. పెంచిన ఎరువులధరలను తక్షణమే తగ్గించాలని లేనిపక్షంలో దేశ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు ఆంజనేయులు, చంద్రసేనారెడ్డి,, వెంకటేష్, వెంకటయ్య తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వింత పత్రాన్ని ఆత్మకూర్తహసిల్దార్ జెకె మోహన్ కు అందజేశారు.

## ఘనంగా సన్మానం


అధికారులను సన్మానిస్తున్న సర్పంచు బొజ్జ గీత అమరేందర్ రెడ్డి

**ఉప్పునుంతల, జూన్ 6 ప్రభాతవార్త:** ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండలంలో నిర్వహిస్తున్న గ్రామ సభలకు హాజరైన మండల స్థాయి అధికారులను సర్పంచు బొజ్జ గీతా అమరేందర్ రెడ్డి ప్రవాస ప్రజా వాణి రాష్ట్ర కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్‌రెడ్డిలు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. మండలంలోని ఉప్పరిపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామ సభకు హాజరైన తహసీల్దార్ అద్దంకి సునీత, మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, పిఆర్ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ మహేష్, బాల్‌రాం నాయక్, పశువైద్య అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, విద్యుత్ ఏఈ కొండల్‌తో పాటు అన్ని శాఖల అధికారులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అదే విధంగా మండలంలోని మామిళ్ళపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభకు హాజరైన ఎస్ఐ పుట్ట మహేష్ గౌడ్‌ను సర్పంచు మొకురాల మోహన్ గౌడ్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

# పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దుదాం : ఎంపీడీవో లక్ష్మీనరసింహులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మినరసింహులు

**చిన్నచింతకుంట, జూన్6 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని ఆయా గ్రామాలను పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో లక్ష్మీనరసింహులు కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకుమండలంలోని పరిధిపూర్, ఉంద్యాల, దమగ్నాపూర్, అమ్మాపూర్, బందర్‌పల్లి గ్రామాలలో శనివారం గ్రామసభలను నిర్వహించారు. పర్దీపూర్ గ్రామంలో గ్రామసర్పంచ్ తెలుగు శివకుమార్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన గ్రామసభలో ఎంపీడీఓ పాల్గొని మాట్లాడుతూ పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి వద్దనే చెత్తను 4రకాలుగా వేరు చేసి ఇవ్వాలని సూచించారు. పరిశుభ్రమైన గ్రామంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. మంచినీటి సరఫరా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, లీకేజీలను మరమ్మతులు చేయాలని ఆయన సూచించారు. ప్రతి ఇంటి ముందు తల్లి పేరు మీద ఒక మొక్కను నాటడం వల్ల పర్యావరణం బాగుంటుందని సూచించారు. ప్లాస్టిక్ నివారణకు ప్రజలందరూ సహకరించి పర్యావరణహిత బ్యాగులను వినియోగించుకోవాలన్నారు. ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. నీటి నిలువ ఉన్నచోట ఆయిల్ బాల్స్ వేయడం ద్వారా దోమల నివారణ వల్ల అంటు రోగాలు రావన్నారు. ఉపాధి హామీ పనుల్లో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన సూచించారు. పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం బాగుంటుందని ప్రతి ఒక్కరూ పరిశుభ్రమైన గ్రామంగా మార్చుకునేందుకు ముందుకు రావాలని సర్పంచ్ శివకుమార్ కోరారు. ప్రజల భాగ్యస్వామ్యంతోనే గ్రామం అన్ని రకాలుగా అభివృద్ధి సాధిస్తుందని ఆ దిశగా ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి శృతి, వివిధ శాఖల అధికారులు ,వార్డు సభ్యులు, రైతులు, ఉపాధి కూలీలు, ప్రజలు పాల్గొన్నారు.

# వెల్కిచర్లలో గ్రామసభ బడిబాటలో పాల్గొన్న అధికారులు


వెల్కిచర్లలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతున్న డీఈఓ

**భూత్పూర్, జూన్ 6, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో నూతన విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియలో భాగంగా శనివారం భూత్పూర్ మండలం వెల్కిచర్లలో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారిణి విజయకుమారి ముఖ్యఅతిథిగా హాజనై ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు ఆవశ్యకత పట్ల ఇటు ఉపాధ్యాయులు, అటు విద్యార్థుల తల్లితండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా వెల్కిచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో డీఈఓ, సీఎంఓ, ఎంఈఓలు పాల్గొన్నారు. గ్రామ సభలో ప్రభుత్వ బడుల విద్యావిధానం ప్రాముఖ్యతను గ్రామస్తులకు వివరించారు. అనంతరం డీఈఓ విజయకుమారి భట్టుపల్లితండా ఏవీఆర్‌కాలనీలో ఏర్పాటు చేసిన తాత్కాలిక పాఠశాలను సందర్శించారు.

డీఈఓ విజయకుమారి వెంట సీఎంఓ సుధాకర్‌రెడ్డి, భూత్పూర్ మండల విద్యాశాఖాధి. కారిణి ఉషారాణి ఉన్నారు. భట్టుపల్లితండాలో సర్పంచి తారు నాయక్, ఉపసర్పంచి సభావత్ జైపాల్‌నాయక్, వెల్కిచర్లలో నిర్వహించిన గ్రామసభలో సర్పంచి రమేష్, ఉపసర్పంచి గోసుల రమేష్‌తో పాటు గ్రామస్తులు పల్లెరాంరెడ్డి, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.


భట్టుపల్లితండా ఏవీఆర్‌కాలనీలో తాత్కాలిక పాఠశాలను సందర్శిస్తున్న డీఈఓ, సీఎంఓ, ఎంఈఓ తదితరులు

## విద్యుత్ సబ్ స్టేషన్ల కోసం స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

**మాగనూర్, జూన్ 06 ప్రభాతవార్త:** మండలంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ మాగనూర్ మండల అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, నాయకులు శివరాంరెడ్డి శనివారం స్థల పరిశీలన చేశారు. అడవి సత్యారం సర్వే నెంబర్ 105, కొత్తపల్లి సర్వే నెంబర్ 247లో సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులకు పరిశీలనలో భాగంగా భూమిని చూపించారు. స్థలపరిశీలనలో ఏడి విజయభాస్కర్, ఏఈ గంగాధర్‌తోపాటు గ్రామస్తులు పాల్గొని ప్రత్యేక చొరవ తీసుకున్న రాష్ట్రమంత్రి వాకిటిశ్రీహరికి ప్రత్యేకధన్యవాదాలు తెలిపారు.

## పంచాయతీ కార్యదర్శికి ఘన సన్మానం

**ఉప్పునుంతల, జూన్ 6 ప్రభాతవార్త:** మండలంలోని మర్రిపల్లి గ్రామంలో పని చేసిన పంచాయతీ కార్యదర్శి శంకర్ ఇటీవల నిర్వహించిన బదిలీల ప్రక్రియలో భాగంగా మండలం లోని తిప్పాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బదిలీపై వెళ్లడంతో శనివారం మర్రిపల్లి గ్రామ సర్పంచ్ సత్తు భూపాల్ రావు ఆధ్వ ర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మర్రిపల్లి గ్రామంలో విధులు నిర్వహిం చిన లక్ష్మణ్ బదిలీపై వెళ్లిన గ్రామంలో కూడా అదే విధంగా విధులు నిర్వహించి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆయన కోరారు. ఈసన్మాన కార్యక్రమంలో గ్రామ సర్పంచు సత్తు భూపాల్ రావు తో పాటు తహసీల్దార్ అద్దంకి సునీత, మండల పంచాయతీ అధికారి వేంకటేశ్వర్లు, ఈజీఎస్ ఏపీఓ పర్వతాలు, జిపిఓ వెంకటేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ బాల్‌రాం నాయక్, విద్యుత్ ఏఈ కొండలు, పీఆర్‌ఎఈ మహేష్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పావని, అంగన్ వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కార్యదర్శి శంకర్‌ను సన్మానిస్తున్న సర్పంచు, అధికారులు

## జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**పెద్దమందడి, జూన్ 6 ప్రభాతవార్త:** పెద్దమందడి ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకోవాలని పెద్దమందడి జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శాంతి రెడ్డి కోరారు. నేటి విద్యాసంస్థల నుండి ఇంటర్ కళాశాలలో విద్యార్థుల కొరకు కళాశాల కిట్ మరియు అల్పాహారం, మధ్యాహ్న భోజనం ప్రారంభం కానుందని, విద్యార్థులకు విలువైన నాణ్యమైన విద్యను ప్రభుత్వ అధ్యాపకులు అందించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మట్టిలో మాణిక్యాలుగా ఇప్పటివరకు కళాశాలలో చేరిన విద్యార్థులు వివిధ రంగాలలో స్థిరపడినట్లు ఆమె తెలిపారు. అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా ఇంటింటా తిరుగుతూ విద్యార్థికి కళాశాల మౌలిక సదుపాయాలు గురించి తెలుపుతూ ఇంటర్ విద్యా విద్యార్థి జీవితానికి వెన్నెముక నినాదాలతో కళాశాల అధ్యాపకులు విద్యార్థులను చైతన్యం చేస్తున్నారు. కార్యక్రమంలో కెమిస్ట్రీ అధ్యాపకులు ప్రవీణ్ కుమార్, సివిక్స్ అధ్యాపకులు తిరుపతయ్య, చెన్నకేశవులు, మహేందర్, తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రభుత్వ కళాశాల విద్యపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

## తరలి వెళ్లిన ప్రజలు రైతులు

**ఉప్పునుంతల, జూన్ 6 ప్రభాతవార్త:** ఆసియాలోనే అతిపెద్ద సమీకృత పండ్ల మార్కెట్ రంగారెడ్డి జిల్లా కొహెడలో శనివారం సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్న అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ ప్రారంభోత్సవానికి మండలం నుంచి భారీ సంఖ్యలో సర్పంచులు, మండల వ్యవసాయ అధికారులు రైతులు, ప్రజలు తరలి వెళ్లారు. మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ ఆధ్వర్యంలో గ్రామాల నుంచి భారీ సంఖ్యలో తరలివెళ్లారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సహకారంతో మండలంలో ఏర్పాటు చేసిన వాహనాలలో తరలి వెళ్లారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామ సర్పంచు చింతగాళ్ళ శ్రీనివాసులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, ఉప్పరి పల్లి సర్పంచ్ బొజ్జ గీత అమరేందర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రవాస ప్రజావాణి కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి కొర్ర రమేష్, మండల విస్తీరణ అధికారులు మంజుల, రాఘ సంధ్య, అనూష, చిన్యా నాయక్ ఆధ్వర్యంలో భారీగా రైతులు తరలి వెళ్లారు.



కొహెడకు భారీ సంఖ్యలో తరలివెళ్తున్న దృశ్యం

## ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంతక్రియలు

**- పోలీస్ శాఖ తరపున అంత్యక్రియల**

**ఖర్చు కోసం రూ.30వేల ఆర్థిక సహాయం అడిషనల్ ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు.**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 06 ప్రభాతవార్త:** శుక్రవారం సాయంత్రం మామిళ్ళపల్లి గ్రామ సమీపంలో పిడుగుపాటు గురై మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ రాజు స్వగ్రామమైన వంగూరు మండలం ఉల్పర గ్రామంలో అతని అంతక్రియలు జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఆదేశాల మేరకు ప్రభుత్వ అధికార లాంఛనాలతో నిర్వహించారు. అంత్యక్రియలకు హాజరైన అడిషనల్ ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు రాజు పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పోలీస్ శాఖ తరపున అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.30వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే పోలీస్ శాఖ తరపున కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ అంత్యక్రియల కార్యక్రమంలో ఆర్ఐ జగన్, ఆర్‌ఎస్ఐలు ప్రశాంత్, గౌస్ పాషా, శివాజీ, ఉప్పునుంతల ఎస్సై మహేష్, జిల్లా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




ఆర్థిక సహాయం అందజేస్తున్న అడిషనల్ ఎస్పీ

## స్ట్రీట్ వెండర్లకు ప్రత్యేక అవగాహన శిబిరం

**నారాయణపేట, జూన్6 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో ప్రధానమంత్రి స్వనిధి పథకం కింద స్ట్రీట్ వెండర్ల కోసం ప్రత్యేక క్యాంపు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్/మున్సిపల్ కమిషనర్ శంకర్ మాట్లాడుతూ స్ట్రీట్ వెండర్లు ఈ పథకం ద్వారా అందుబాటులో ఉన్న రుణాలను పొందుతూ తమ వ్యాపార అభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే కొత్త స్ట్రీట్ వెండర్లను గుర్తించి వారికి కూడా బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత సత్య యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ నిధి (పీఎంఎస్‌వానిధి) పథకం ద్వారా వీధి విక్రయదారులు రుణాలు తీసుకొని తమ వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) విజయ్ మాట్లాడుతూ స్ట్రీట్ వెండర్లు రుణాలను సక్రమంగా వినియోగించుకోవడంతో పాటు వాటిని గడువులోగా తిరిగి చెల్లించడం ద్వారా భవిష్యత్తులో మరిన్ని ఆర్థిక అవకాశాలు పొందవచ్చని వివరించారు ఈ కార్యక్రమంలో టీజీబీ బ్యాంకు మేనేజర్, ఎస్‌బీఐ సివిల్ లైన్స్ బ్యాంకు మేనేజర్, ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్, మెప్మా డీఎంసీ శివకుమార్, టీఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు సాయికుమారి, మెప్మా సిబ్బంది, ఆర్పీలు మరియు పెద్ద సంఖ్యలో వీధి విక్రయదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ శ్వేత సత్య యాదవ్

## సైబర్ నేరాలపై అవగాహన కల్పించండి

**మాగనూర్, జూన్6 ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండి, ప్రజలకు అవగాహన కల్పించాలని హెడ్ కానిస్టేబుల్ అర్జున్ శనివారం సూచించారు. మాగనూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌరస్తాలో విద్యార్థులు, ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీసీలు సాయి కుమార్, మల్లేష్, హోంగార్డ్ నరసింహ పాల్గొని సైబర్ నేరాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తూ వారు మాట్లాడారు. వాట్సాప్, ఎస్‌ఎంఎస్, ఫోన్ కాల్స్ ద్వారా వచ్చే నకిలీ లింకులు, ఓటీపీ షేరింగ్, ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ ఆఫర్లు, లాటరీలు, డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. తెలియని లింకులపై క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత బ్యాంక్ వివరాలు ఎవరికి తెలియజేయవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు.



# మండలంలో ముమ్మరంగా గ్రామ సభలు

- **ప్రజలకు, రైతులకు అందని పథకాలపై ఆవేదన వ్యక్తం చేస్తున్న మర్రిపల్లి సర్పంచ్**
- **ప్రజా పాలనలో సాధించిన ప్రగతిపై వివరిస్తున్న ఉప్పరపల్లి సర్పంచ్**

**ఉప్పునుంతల, జూన్ 6 ప్రభాతవార్త:** గ్రామాలలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వాలు పనిచేయాలని, తాము సర్పంచ్‌గా గెలిచిన తర్వాత గ్రామాలలో ప్రజలకు న్యాయం చేయలేకపోతున్నామని గ్రామ సభలు నిర్వహించి, మండల స్థాయి అధికారులు హాజరైనప్పటికీ గ్రామాల్లో అభివృద్ధి చేపట్టేలా అధికారులు పని చేయాలని మర్రిపల్లి సర్పంచ్ సత్తు భూపాల్ రావు అన్నారు. శనివారం గ్రామ సర్పంచ్ సత్తు భూపాల్ రావు అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన అధికారులు గ్రామసభలో మాట్లాడుతూ రైతులు వ్యవసాయ సాగు ద్వారా బహుళ ప్రయోజనం పొందేందుకు పంట మార్పిడి విధానాన్ని పాటించాలని మండల వ్యవసాయ విస్తీర్ణాధికారిణి రాఘ సంధ్య అవగాహన కల్పించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మండలంలో నిర్వహించిన గ్రామ సభలకు హాజరైన అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలం సీజన్ వస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, సీజన్ వ్యాధులకు దూరంగా ఉండాలని మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ఏపీఓ పర్వతాలు ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గృహ నిర్మాణ శాఖ అధికారిణి గాయత్రి మాట్లాడుతూ మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నిర్మించుకున్న లబ్ధిదారుల వివరాలు, పూర్తి చేసిన వారి వివరాలను ఆమె వివరించారు. ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 పట్ల ప్రజలకు అవగాహన కలిగేలా వివరించారు.



గ్రామసభలో మాట్లాడుతున్న గ్రామ సర్పంచ్ సత్తు భూపాల్ రావు

**త్వరలోనే రెండో విడత ప్రారంభమవుతుంది..**

**ఉప్పరిపల్లిలో..**

గ్రామాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని, ప్రభుత్వం ప్రజలకు అందించే పథకాల ప్రయోజనాలు సకాలంలో ప్రజలు, రైతులు సహకరించాలని గ్రామ సర్పంచ్ బొజ్జ గీత అమరేందర్ రెడ్డి సూచించారు. శనివారం 99 రోజుల ప్రణాళిక, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచు బొజ్జ గీత అమరేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ సభకు హాజరైన అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని, రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్టర్ పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. ఉపాధి హామీ పథకంలో ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఈజీఎస్ ఏపీఓ పర్వతాలు అవగాహన కల్పించారు. గ్రామసభలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత శాఖ అధికారులతో సమీక్షించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అద్దంకి సునీత పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి పనులను ప్రణాళిక బద్ధంగా అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ జాబ్ క్యాలెండర్ రూపొందిస్తామని మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు ప్రజలకు హామీ ఇచ్చారు. సమీక్ష ముందు గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామసభలో అధికారులకు గ్రామ సర్పంచ్ బొజ్జ గీతా అమరేందర్ రెడ్డి వివరించారు. అదేవిధంగా మండలంలోని మామిళ్ళపల్లి, దాసర్లపల్లి, లక్ష్మాపూర్ పెద్దాపూర్, మొల్గర గ్రామాలలో గ్రామ సర్పంచులు మొకురాల మోహన్ గౌడ్, ఉప సర్పంచ్ పానుగంటి శంకర్, బీషం గోపాల్, వంగా సాయిబాబుగౌడ్, శ్రీపురం సులోచనమ్మల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామ సభలకు తహసీల్దార్ అద్దంకి సునీత, మండలపంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, ప్రవాస ప్రజావాణి రాష్ట్ర కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి, విద్యుత్ ఏఇ కొండలు, ఎస్సై పుట్ట మహేష్ గౌడ్, పంచాయతీ రాజ్ ఎఇ మహేష్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎఇ బాల్ రాం నాయక్, ఈజీఎస్ ఏపీఓ పర్వతాలు, పశు వైద్య అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, హౌసింగ్ ఏఈ గాయత్రి, ఐసిడిఎస్ సూపర్వైజర్ పావని, ఇరిగేషన్ ఎఇ అలి వేలమ్మ, ఐకెపి సి సి పద్మ, మండల వ్యవసాయ విస్తీరణ అధికారులు రాఘ సంధ్య, మహేష్, జిపిఓలు వెంకటేష్, రాము, ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు ప్రదీప్ రావు, సత్యనారాయణ, జ్యోతి, నరసింహ, సైదు బాబు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు, రైతులు పాల్గొన్నారు.



ప్రగతి నివేదిక వివరిస్తున్న ఉప్పరి పల్లి గ్రామ సర్పంచ్ బొజ్జ గీత

## ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరంతర పోరాటాలు

### సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు

**ఆత్మకూర్ జూన్ 6, ప్రభాతవార్త;** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సిపిఐ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు చేసేందుకు ప్రజలు సన్నద్ధం కావాలని వనపర్తి జిల్లా సిపిఐ కార్యదర్శి విజయరాములు విజ్ఞప్తి చేశారు. శనివారం మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పెరిగిన ఇత్యవసర సరుకులు తరలకు కార్మికులకు కనీస వేతనాలు పెంచడంలో కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న దేశ ఆర్థికమాంధ్య విధానాలను సాకుగా చూపిస్తూ కేంద్ర ప్రభుత్వం రైతులపై ఎరువుల ధరను మోపి అధిక భారం మోపడం ఎంతవరకు సమంజసమని అయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో జాప్యం చేయడం సరికాదని ఇకనైనా గత శాసనసభ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చేందుకు కృతనిచ్చేయంతో పని చేయాలని అందుకు తక్షణమే కార్యాచరణ రూపొందించి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న అధిక ధరలను నిరసిస్తూ ఈనెల 10వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాలలో ఆందోళన కార్యక్రమాలకు పూనుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. ఇటీవల హైదరాబాద్ నగరంలో జరిగిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన మండల స్థాయి కార్యకర్తలకు వివరించారు. గ్రామస్థాయిలో సిపిఐ తరఫున ప్రజా సమస్యల మీదకు తీసి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు గ్రామస్థాయి కార్యకర్తలు విస్తృతంగా పని చేయాలని అందులో భాగంగానే ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిపిఐ ఆధ్వర్యంలో నిరంతరం సమావేశాలు నిర్వహించనున్నట్లుగా ఆయన తెలిపారు. ఈ సమావేశానికి ఆత్మకూరు మండల సిపిఐ కార్యదర్శి లక్ష్మీనారాయణ శెట్టి, అధ్యక్షత వహించగా సిపిఐ నాయకులు మోష, లక్ష్మీనారాయణ, నరసింహ శెట్టి, శ్రీహరి తదితరులతో పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి విజయరాములు

## వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామ సభ

**గద్వాల జూన్ 06, ప్రభాతవార్త :** గద్వాల మండలం లోని మదనపల్లి గ్రామం లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభ లో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రతీ రైతు ఆధార్ తో ప్రతి పౌరునికి గుర్తింపు ఇచ్చినట్టు గానె ప్రతి రైతుకు పదకొండు నంబర్ లతో విశిష్ట సంఖ్య (యూనిక్యూ కోడ్) వస్తుందని తెలిపారు. దీని ఆధారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వల నుండీ వచ్చిన పతకాలు సద్వినియోగం చేసుకొనుటకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ గ్రామం సభ లో నానో యూరియా వ్యాయామం లో సులభతరం చూసుకొనే విషయం పై జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ సాధారణ యూరియా 2 నుండి 4 బస్తాలు అవసరం అవుతుంది నానో యూరియా విషయానికి వస్తే ఎకరాకు 500 ఎంఎల్ బాటిల్ సరిపోతుంది. రవాణ ఖర్చు అదనం నానో యూరియా ఖర్చు ఉండదని 35 శాతం మాత్రమే పంటకు అందుతుందని, మిగతాది ఆవిరి అవుతుందని సూచించారు. నానో యూరియా 80 శాతం మొక్కలకు అందుతుందని, అంతే కాకుండా పంట మార్పిడి ద్వారా ఆయిల్ పామ్ సాగు చేసుకున్నట్టు అయితే ఆయిల్ పామ్ మొక్కలు, సాగు ఖర్చులకు మొదట 4 సంవత్సరాల పాటు సుమారు 50,000 నుండి 5,2000 వరకు రాయితీ లభిస్తుంది. ఎస్సి, ఎస్టీ రైతులకు 100శాతం సబ్సిడీ, బిసి రైతులకు 90శాతం సబ్సిడీ ఇతర రైతులకు (గణిష్ఠంగ 12.50 ఎకరాలకు వరకు) ప్రోత్సాహలు ఇస్తున్నారని తెలిపారు. ఈ సభ లో డి. టి ఉదయ్, జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప, సర్పంచ్ సంజీవ్, ఉప సర్పంచ్ హనుమన్న, వ్యవసాయ విస్తరణ అధికారీ వంశి పంచాయతీ కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.



సూచనల పోస్టర్ విడుదల చేస్తున్న వ్యవసాయ అధికారులు

## పంట మార్పిడితో ఆహార భద్రతను కాపాడుకుందాం

**వీపనగండ్ల జూన్ 6, ప్రభాతవార్త;** మండలంలోని నాగర్ల బండ తండా, కొర్లకుంట గ్రామాలలో పంట మార్పిడి ఆవశ్యకతపై వ్యవసాయ అధికారులు పంటల మార్పిడి ఆహార భద్రతను కాపాడుకునే అంశంపై గ్రామాలలో రైతు సదస్సులు నిర్వహిస్తున్నారు కొన్ని అంశాలను వివరించడం జరిగింది. ప్రధానంగా వీపనగండ్ల మం డలంలో 18 వేల ఎకరాలలో వానాకాలంలో వరి పండించడం జరుగుతుంది. అని వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ తెలిపారు. పంట మార్పిడి లో భాగంగా 18 వేల ఎకరాలలో కనీసం 2 వేల ఎకరాలలో పప్పు దినుసులకు సంబంధించి మినుములు, పెసర్లు, కందులు, వేరుశనగ, కొర్రలు, సజ్జలు ఇలాంటి ఆరు తడి పంట లు సాగు చేయాలని సూచించడం జరిగింది. పంట మార్పిడి చేయ డం వల్ల భూసారం పెరగడం జరుగుతుంది. పంట దిగుబడి కూడా మెరుగవుతుంది. పంట జీవవైవిధ్యం కూడా పెరుగుతుంది. మృత్తిక క్రమ క్షయం కూడా తగ్గుతుంది. నీటి ఆదా కూడా చేయవచ్చు. చీడపీడలు, తెగుళ్ల భారీ నుండి పంటను కాపాడుకోవచ్చు. ఈ కార్యక్రమంలో కొర్లకుంట సర్పంచ్ పానుగంటి శ్రీదేవి మాజీ ఎంపీపీ కమలేశ్వర రావు నాగర్ల బండతండ సర్పంచ్, గోపాల్ నాయక్ ఏవో డాకేశ్వర్ గౌడ్, పంచాయతీ సెక్రెటరీ , ఏఈఓ నారియా నాయక్ , ఇతర డిపార్ట్మెంట్ అధికారులు, రైతులు పాల్గొన డం జరిగింది.



నాగర్ల బండ తండాలో
రైతులతో సమావేశమైన వ్యవసాయ అధికారులు

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామసభ

**దేవరకద్ర, జూన్ 6 ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా దేవరకద్ర మండలం వెంకటాయపల్లిలో శనివారం రోజు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. శుభ్రత పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి సూచించారు. కావున గ్రామ ప్రజలందరూ జాగ్రత్తలు తీసుకోవా లని సూచించారు. ఈ గ్రామ సభలో గ్రామానికి సంబంధించిన సమస్యలు, అభివృద్ధి పనుల గురించి చర్చించారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాసరావు మరియు ఎస్ఐ నాగన్నను శాలువాతో ఘనంగా సన్మానించిన సర్పంచ్ రామాంజనేయులు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన గ్రామపంచాయతీ కార్యదర్శిని శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎస్ఐ నాగన్న, గ్రామ సర్పంచ్ సక్కెరి రామాంజనేయులు, మాజీ సర్పంచ్ రంగయ్య గౌడ్, పంచాయతీ సెక్రటరీ రామ్మోహన్ గౌడ్, వార్డ్ సభ్యులు, ఆశ అంగన్వాడి కార్యకర్తలు మరియు గ్రామ పెద్దలు యువకులు మహిళలు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న గ్రామ సర్పంచ్ రామాంజనేయులు

## అసంపూర్తి ఇంటి నిర్మాణానికి సహాయం



సిమెంట్‌ను బహుకరిస్తున్న దృశ్యం

**వెల్దండ, జూన్6 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని అజిలాపూర్ గ్రామంలో గునగంటి చంద్రయ్య ఇంటి అసంపూర్తి నిర్మాణానికి రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ అవసరమైన సిమెంట్‌ను గ్రామసర్పంచ్ రమేష్‌గౌడ్ ద్వారా అందించారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు అండగా ఉప్పల వెంకటేష్ నిలుస్తున్నారని అన్నారు.

## పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

**దామరగిద్ద, జూన్6 ప్రభాతవార్త:** కొత్త విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి అందేలా చర్యలు చేపట్టారు. మండల విద్యా వనరుల కేంద్రం (ఎంఆర్‌సీ) కార్యాలయంలో శుక్రవారం పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ప్రోగ్రెస్ కార్డులను మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేశారు. మండల విద్యాధికారి కృష్ణారెడ్డి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యా సామగ్రిని అందజేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అందుబాటులో ఉంచుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మాణిక్, బాలరాజ్, రాధిక, వనిత జ్యోతి, మాలతి, నరేష్, కురుమూర్తి, సీఆర్పీలు మహిపాల్, రాములు, కంప్యూటర్ ఆపరేటర్లు నాగేందర్, వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలలో చేర్పించండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**చిన్నచింతకుంట, జూన్6 ప్రభాతవార్త:** 10వతరగతి పూర్తిచేసిన తమ పిల్లలను మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని కళాశాల జూనియర్ లెక్చరర్‌లు తల్లిదండ్రులను కోరారు. శనివారం నెల్లికొండి గ్రామంలో ప్రభుత్వ కళాశాల జూనియర్ లెక్చరర్లు ఇంటింటికి వెళ్లి జూనియర్ కళాశాలలో తమ పిల్లల్ని చేర్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తున్నామన్నారు. నాణ్యమైన విద్యను అందించేందుకు అనుభవజ్ఞులైన లెక్చరర్లు అందుబాటులో ఉన్నారన్నారు. తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పంపించాలని కోరారు. ప్రభుత్వజూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపిసి, సిఇసి, హెచ్ఇసి కోర్సులు (తెలుగు/ఇంగ్లీష్) మీడియం అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు ఆసక్తి ఉన్న కోర్సులో చేరవచ్చని వారు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్లు బురాన్, కరంవీర్ సింగ్, సురేందర్, కవిత, సంగీత, శివ లు ఉన్నారు.

## పిడుగు పడి పాడి పశువు మృతి

**నవాబుపేట జూన్ 6 ప్రభాతవార్త :** శనివారం మధ్యాహ్నం గాలివాన ఉరుములు మెరుపులతో కూడిన గాలివానకు పిడుగు పడి నవాబుపేట గ్రామానికి చెందిన బంక వెంకటయ్య రైతు తన పొలంలో కట్టేసి ఉన్న బర్రె రూ.1.20లక్ష విలువగల బర్రె పిడుగుపాటుకు గురై మృతి చెందింది. గమనించిన కుటుంబ సభ్యులు దాదాపు రోజుకు 10 లీటర్ల పాలు ఇచ్చే బర్రె మృతి చెందడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు. వెంటనే స్థానిక అధికారులకు సమాచారం ఇచ్చారు. వెటర్నరీ అధికారులు వచ్చి వివరాలు తీసుకున్నారని రైతు బంక వెంకటయ్య తెలిపారు.

## మా ప్రకటనతోనే చలనం..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

వైపు వెళ్లిండు.. అక్కడ పనులు.. చెక్ డ్యామ్ లు చూసిండు.. దానితో తెలంగాణ కు ఒరిగిందేమి లేదన్నారు. బనకచర్ల గురించి అసలు ముఖ్యమంత్రి మాట్లాడలేదని, ఆదిత్యనాథ్ అనే అధికారిని తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్ కు తెలంగాణ నీళ్ల తీసుకెళ్లేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కాలువలు. టన్నెలు.. మోటర్లు.. పంపు హౌస్.. రిజర్వాయర్లు కట్టింది కెసిఆర్ ప్రభుత్వమని స్పష్టం చేశారు. వాటిలో కనీసం తట్టెడు మట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్త లేదన్నారు. పాలమూరు ప్రాజెక్ట్ లో 33,500 కోట్ల పని చేసాము... పెండింగ్ బిల్లులు కొన్ని ఇచ్చి మేము పని చేశామని అనడం సరి కాదన్నారు. ప్రాజెక్ట్ జాప్యం కావడానికి కారణం కాంగ్రెస్.. కేసులు వేయించారు. న్యాయప్రమైన చిక్కులు అన్ని తొలగించుకుంటూ ప్రాజెక్ట్ ను చివరిదాశకు కెసిఆర్ తీసుకువచ్చారని చెప్పారు. సొంత జిల్లాకు 20 వేల కోట్లు ప్రతి ఏడాదికి ఇవ్వమని సీఎం రేవంత్ రెడ్డి కాబినెట్ ను కోరారు. గ్రీన్ ఛానెల్ ద్వారా 5 ఏండ్లలో లక్ష కోట్లు ఇస్తామని మాట తప్పారని, రేవంత్ రెడ్డి చెప్పినట్లు నిధులు విడుదల చేయలేదన్నారు. రేవంత్ రెడ్డి తిట్లు తప్ప ఏం లేదు..పాదయాత్ర చేస్తామని చెప్పాగానే రెండున్నర యేండ్ల కు ప్రాజెక్ట్ సందర్శన చేసిండని, వచ్చి ఎప్పుడు పూర్తి చేస్తారో కూడా చెప్పలేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వనందుకు యువత .. వడ్లు కొనానందుకు.. కరెంటు ఇవ్వనందుకు. యూరియా ఇవ్వలేదని రైతులు..పెంచి ఇస్తామని చెప్పిన పెన్షన్ ఇవ్వనందుకు ప్రజలు ఓట్లు వేస్తారా?? ఏ సామాజిక వర్గం కూడా కాంగ్రెస్ పాలన పై సంతృప్తి గా లేరని అన్నారు. బీఆర్ఎస్ జెండా బారాబర్ తెలంగాణ లో ఎగురుతదని భీమా వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు రామ్ మోహన్ రెడ్డి, అంజయ్య, మాజీ కార్పొరేషన్ చైర్మన్ లు వాల్యా నాయక్, ఇంతియాజ్ ఇసాక్, శ్రీనివాస్ యాదవ్, జడ్పీ మాజీ చైర్మన్ యాదయ్య, గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## బాలల గొంతుక బాల పంచాయతీలు

**మొదటి పేజీ తరువాయి భాగం..**

సమర్థవంతమైన సంభాషణా నైపుణ్యాలు,జట్టుభావన,సామాజిక బాధ్యత మరియుసేవాదృక్పథం వంటి విలువలు పెంపొందించేందుకు బాలపంచాయతీలు దోహదపడతాయని పేర్కొన్నారు.గ్రామాల్లోని బాలబాలికల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనిచేసేలా బాల పంచాయతీలను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.బాల పంచాయతీ సభ్యులు గుర్తించినసమస్యలను అధికారులు సానుకూలంగా స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.బాలల అనుకూలవాతావరణం కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ క్రమంలో బి డబ్ల్యు ఓ జరీనా, డిప్యూటీ డి ఈ ఓ శ్రీనివాస్, డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, డి సి ఆర్ బి డి ఎస్ పి రమణా రెడ్డి, సిడబ్ల్యుసి ఛైర్మెన్ నయీముద్దీన్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ కృష్ణయ్య, వుమెన్ సేఫ్టీ వింగ్ ఇన్స్పెక్టర్ సైదా రావు, తాసిల్దార్ మల్లికార్జున, ఎంఈఓ రాజు నాయక్, ఎంపీపీ నారాయణ, యంగిస్తాన్ ఫౌండేషన్ సభ్యురాలు జాగృతి, చిన్మయి థామస్, సర్పంచ్ రాంలాల్, మండల ప్రజలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనకు సహకరించాలి


కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల జూన్ 06, ప్రభాతవార్త:** ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. నాగేశ్వర్ రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ చెత్త నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని తెలిపారు.భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన,ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు.ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు నినాద ఫలకాలు, బ్యానర్లు, పోస్టర్లతో నగరంలోని ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా సరైన విధంగా నిర్వహించాలని, పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని ప్రజలకు సూచించారు.ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన స్టాల్‌ను ప్రజలు సందర్శించి ప్లాస్టిక్ కాలుష్య నివారణ చర్యలపై వివరాలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో సహాయ పర్యావరణ శాస్త్రవేత్త విద్యుల్లత, ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## దీన్ దయాళ్ ఉపాధ్యాయ శిక్షణ

**బీజేపీ గిరిజన మోర్చా సీనియర్ నాయకుడు తిరుపతి నాయక్**

**గోపాల్‌పేట్, జూన్ 06 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాలో నిర్వహించిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ శిక్షణ మహాఅ భియాన్ తరగతుల కార్యక్రమంలో రేవల్లి మండల బీజేపీ అధ్యక్షుడు బాలునా యక్, గోపాల్‌పేట్ మండల్ బీజేపీ గిరిజన మోర్చా సీనియర్ నాయకుడు తిరుపతి నాయక్ పాల్గొన్నారు. ఈ సం దర్భంగా పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత బలోపేతం, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, కార్యకర్తల పాత్ర, గ్రామ స్థాయి నుంచి పార్టీ విస్తరణకు చేపట్టాల్సిన కార్యాచరణపై నాయకులకు శిక్షణ అందించారు. రేవల్లి మండల అధ్యక్షుడు బాలు నాయక్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు ప్రజలకు కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా చేరవేయాలని సూచించారు. గిరిజన మోర్చా సీనియర్ నాయకుడు తిరుపతి నాయక్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ శిక్షణ కార్యక్రమం కార్యకర్తలకు పార్టీ విధానాలు, లక్ష్యాలపై మరింత అవగాహన కల్పించడంతో పాటు సంస్థాగతంగా బలోపేతం కావడానికి ఉపయోగపడుతుందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా

## ధన్వాడలో ఏఐయుకెఎమ్ఎస్ రైతుల ధర్నా

**ధన్వాడ జూన్ 6 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ రైతు, వ్యవసాయ వ్యతిరేక విధానాలకు నిరసనగా అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయు కెఎంఎస్) ఆధ్వర్యంలో ధన్వాడ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి సంఘం నాయకులు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సమయానికి అందించడంతో పాటు బ్యాంకు రుణాల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మార్కెట్లో నకిలీ విత్తనాలు (పత్తి, కంది, వరి) విస్తృతంగా విక్రయిస్తూ ప్రైవేటు వ్యాపారులు లాభాలు ఆర్జిస్తున్నారని, దీనిపై కఠిన చర్యలు తీసుకుని నియంత్రణ చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. అదేవిధంగా పేదలకు ఇళ్లు, పెన్షన్లు, సాగుభూమి అందించాలన్నారు. పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడంతో రైతులు మరియు సాధారణ ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతూ కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని, పని దినాలను 200 రోజులకు పెంచి రోజువారీ కూలిని రూ.700కు పెంచాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ధన్వాడ తహసిల్దార్ సింధుజకు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి జి. కృష్ణయ్య, మాస్ లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి సలీమ్, మండల అధ్యక్షుడు కె.టి. రప్ప, మండల కార్యదర్శి పీకే రాములు, పాండు, నాగేష్, తెలుగు సాయప్ప, బోయ కృష్ణప్ప, రాములు, బీరప్ప తదితరులు మరియు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా మెలగాలి

**మహబూబ్ నగర్ ఎస్పీ జానకి ధరావత్**

**మహమ్మదాబాద్, జూన్ 6 ప్రభాతవార్త :** ఫిర్యాదు దారుల పట్ల పోలీసు అధికారులు మర్యాదగా మెలగాలని మహబూబ్నగర్ ఎస్పీ జానకి ధరావత్ సూచించారు. మహమ్మదాబాద్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డి.జానకి సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, సిబ్బంది పనితీరు, శాంతిభద్రతల పరిస్థితులను పరిశీలించి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు సత్వర, పారదర్శక మరియు నాణ్యమైన పోలీసు సేవలు అందించాలని, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ గాంధీ నాయక్, సబ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ రెడ్డి మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పాలమూరులో జర్నలిస్టుల క్రికెట్ పోటీలు

**ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహణ**

మహబూబ్ నగర్, జూన్ 6, ప్రభాతవార్త : మహబూబ్నగర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నరేంద్ర చారి, నరేందర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్నగర్ క్రికెట్ మైదానంలో నేటి నుంచి రెండు రోజులపాటు నిర్వహించే పోటీల్లో గెలుపొందిన మొదటి జట్టుకు రూ.6000, రన్నర్ టీంకు బహుమతి రూ.4000 అందజేయనున్నట్లు ప్రకటించారు. కావున అన్ని విభాగాల మీడియా మిత్రులు అందరూ క్రికెట్ పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

# లిక్కర్ ఫ్యాక్టరీ జలదోపిడిపై సమగ్ర విచారణ చేపట్టాలి

**నది జలాలను అక్రమంగా తరలిస్తున్న ఎబిడి లిక్కర్ ఫ్యాక్టరీ**

**ఫ్యాక్టరీ వ్యర్థాలతో కలుషితమవుతున్న కృష్ణానది నీరు,ప్రాణ నష్టం,**

**పంట నష్టం జరుగుతున్న మౌనం వహిస్తున్న అధికారులు**

**అక్రమ నీటి తరలింపు ఇరిగేషన్ అధికారులకు కనిపించడం లేదా?**

**నదీ జలాల అక్రమ తరలింపుపై గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తాం**

**బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్**


అక్రమ నీటి వాడకంపై కలెక్టర్ కు వినతిపత్రం అందజేస్తున్న రాచాల

**వనపర్తి,జూన్ 6, ప్రభాతవార్త:** ఎబిడి లిక్కర్ ఫ్యాక్టరీ జల దోపిడీపై సమగ్ర విచారణ చేపట్టాలని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం పెబ్బేరు మండలంలోని రంగాపూర్ శివారులో గల ఎబిడి లిక్కర్ ఫ్యాక్టరీ సమీపంలోని కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రాచాల మీడియాతో మాట్లాడుతూ ఎబిడి లిక్కర్ ఫ్యాక్టరీ అక్రమ నీటి వాడకంపై గత కొన్ని నెలలుగా బీసీ పొలిటికల్ జేఏసీకి ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు రావడం జరిగిందన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా కృష్ణానది నీటిని అక్రమంగా వాడుకుంటున్నారని, అదేవిధంగా ఫ్యాక్టరీ నుంచి వెలువడే వ్యర్థాలను కృష్ణా నదిలో కలుపుతున్నట్లు కూడా మా దృష్టికి వచ్చిందన్నారు. వేసవికాలంలో కృష్ణానది నీరు అడుగంటి పోవడంతో వ్యవసాయానికి కూడా క్రాఫ్ హాలిడే ఇచ్చారని, అంతేకాకుండా ఇటీవల జరిగిన బీచుపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు సైతం తాగునీటికీ ప్రజలు అనేక తంటాలు పడ్డారని ఆయన గుర్తు చేశారు. ఇలాంటి సందర్భంలో నది పక్కనే ఉన్న లిక్కర్ ఫ్యాక్టరీ కృష్ణానది జలాలను స్టోరేజ్ చేసుకొని, 30హెచ్‌పీ, 40హెచ్‌పీ మోటార్లతో అక్రమంగా ఫ్యాక్టరీకి తోడేస్తున్నారని మండిపడ్డారు. నిబంధన ప్రకారం నదీ జలాలను మొదటగా తాగడానికి, సాగు చేసుకోవడానికి వాడుకోవాలని, తర్వాతనే ఇతర అవసరాల కోసం ప్రభుత్వ అనుమతులతో వాడుకోవాల్సి ఉంటుందన్నారు. నేడు ప్రజలు తాగునీటికీ, రైతులు వ్యవసాయానికి నీరు లేక అల్లాడుతున్నారని, లిక్కర్ ఫ్యాక్టరీ యాజమాన్యం మాత్రం దర్జాగా జలదోపిడి చేస్తుందని విమర్శించారు.పట్టపగలు ఇంత జలదోపిడి జరుగుతున్న ఇరిగేషన్ శాఖ అధికారులు ఎందుకోసం మోనంగా ఉన్నారని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వెంటనే స్పందించి కృష్ణానది జలాల అక్రమ తరలింపుపై సమగ్ర విచారణకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ఫ్యాక్టరీ వ్యర్థాలతో కలుషితమవుతున్న కృష్ణానది నీటి వల్ల జీవరాసులు సైతం మృతి చెందుతున్నాయని, ఈ సమస్యపై చెన్నై లోని గ్రీన్ ట్రిబ్యునల్ కు ఫిర్యాదు చేసి జలదోపిడిని అడ్డుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ జెఏసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, నాయకులు దేవర శివ, బత్తుల జితేందర్, రామన్ గౌడ్, బీచుపల్లి సర్పంచ్, బీసిరెడ్డి, ఉప సర్పంచ్ నాగరాజు, ఆదామ్, రాజశేఖర్ గౌడ్, వీరేష్, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బిపిఈడిలో 353ర్యాంక్


గిరిజ

**మహబూబ్‌నగర్, జూన్ 6 ప్రభాతవార్త :** నవాబుపేట కేజీబీవీలో విద్యను అభ్యసించిన రి.గిరిజ బీపీఈడీ రాష్ట్రస్థాయి పరీక్షలో 353ర్యాంకు సాధించింది. ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు కేజీబీవీ నవాబుపేటలో పూర్తిచేసి,డిగ్రీను ఎం.వి.ఎస్..డిగ్రీ కళాశాలలో పూర్తి చేసింది. బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్షలో 353 రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించడంతో నిరుపేద కుటుంబానికి చెందిన గిరిజను అందరూ అభినందిస్తున్నారు మహబూబ్నగర్ జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయ్ కుమారి అభినందించారు. జీవితంలో మంచి ఉద్యోగాన్ని సాధించి స్థిరపడాలని ఆకాంక్షి ంచారు.

# సత్వర న్యాయంతో వివాదాలకు శాశ్వత ముగింపు


జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కళార్చన

**వనపర్తి, జూన్ 6, ప్రభాతవార్త:**వివాదాలు కొనసాగాలంటే జీవితకాలం పడుతుంది కానీ పరస్పర అవగాహనతో రాజీకి సిద్ధమైతే క్షణాల్లో పరిష్కారం లభిస్తుంది. ప్రజలకు సత్వర, సులభ, న్యాయం అందించడమే జాతీయ మెగా లోక్ అదాలత్ లక్ష్యమని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కళార్చన అన్నారు.ప్రజలకు సత్వర, సులభ, న్యాయం అందించడంలో జాతీయ మెగాలోక్ అదాలత్ కీలక పాత్ర పోషిస్తోందని ఆమె తెలిపారు. శనివారం రోజు వనపర్తి జిల్లా న్యాయస్థానంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని పోలీసు అధికారులు, కోర్టు సిబ్బందితో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి శ్రీమతి కళార్చన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళార్చన మాట్లాడుతూ జూన్20వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. రాజీ పడదగిన కేసులను గుర్తించి కక్షి దారులకు లోక్ అదాలత్ ప్రయోజనాలను వివరించి, పరస్పర అవగాహనతో కేసుల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ప్రజలకు న్యాయం త్వరగా అందాలంటే లోక్ అదాలత్‌లను విస్తృతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. కోర్టుల్లో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించడం ద్వారా కక్షి దారులకు మానసిక ప్రశాంతత లభించడంతో పాటు సమయం, ధనం, శ్రమ కూడా ఆదా అవుతాయని వివరించారు. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, కుటుంబ వివాదాలు, ఆస్తి తగాదాలు, రోడ్డు ప్రమాద పరిహార కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్,టౌన్ న్యూసెన్స్ తదితర కేసులను రాజీ మార్గంలో పరిష్కరించడం ద్వారా ప్రజల్లో న్యాయవ్యవస్థపై విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని ఆమె అన్నారు. పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రతి కక్షి దారునికి లోక్ అదాలత్ ద్వారా లభించే ప్రయోజనాలను వివరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు కవిత, కార్తీక్ రెడ్డి, శ్రీలత, అశ్విని, వనపర్తి డీఎస్పీ గిరిబాబు, వనపర్తి సీఐ సుగంధరత్నం, ఆత్మకూరు సీఐ, శివకుమార్, జిల్లాలోని ఎస్సైలు, కోర్టు కానిస్టేబుళ్లు సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బైక్‌పై క్షేత్రస్థాయిలో పర్యటన..

**మహబూబ్‌నగర్ రూరల్ మండలంలో**

**పర్యటించిన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**


బైక్‌పై క్షేత్రస్థాయిలో సందర్శనకు వెళుతున్న అదనపు కలెక్టర్

**మహబూబ్‌నగర్,జూన్6,ప్రభాతవార్త:**మహబూబ్‌నగర్ మండలం కోటకదిర,పోతనపల్లి మాచన్పల్లి గ్రామాలలో శనివారం స్థానిక సంస్థల అదనపుకలెక్టర్ మధుసూదన్‌నాయక్ పర్యటించి నర్సరీలను, ఇందిరమ్మఇళ్లను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకే ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను ద్విచక్ర వాహనంపై స్వయంగా వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో ఎం.పి.డి. ఓ,పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

# ఈనెల 13న అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ పోటీలు

**- 5 కి.మీ, 10 కి.మీ. రోడ్డు స్పీడ్ రేస్..**

**- ఈనెల 10లోపు రిజిస్ట్రేషన్ జిల్లా కార్యదర్శి బి.గోపాలం**


మాట్లాడుతున్న జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం

**మక్తల్, జూన్ 6 ప్రభాతవార్త:** సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ మహేందర్ పాల్ సింగ్, ఖేలో ఇండియా కోచ్ పాష భాయ్,తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పి.మల్లారెడ్డి, బి.విజయ కాంతారావు ఆదేశాల మేరకు మక్తల్ పట్టణంలో ఈనెల 13న అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ సిటీ లీగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం తెలిపారు. ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలికలు, మహిళలకు 5 కి.మీ, 10 కి.మీ.రోడ్డు స్పీడ్ సైకిల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గద్వాల్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు ఇతర జిల్లాలకు చెందిన వారు కూడా పాల్గొనవచ్చని తెలిపారు. 2008 నుంచి 2013 మధ్య జన్మించిన బాలికలు, 2007కు ముందు జన్మించిన మహిళలు పోటీల్లో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 10వ తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి క్యాటగిరీలో ఎంతమందైనా పాల్గొనవచ్చు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు, గెలుపొందిన వారికి మెరిట్ సర్టిఫికెట్, మెడల్, మనీ ప్రైజ్ అందజేస్తామన్నారు. ఈ సైక్లింగ్ సర్టిఫికెట్లు స్పోర్ట్స్ కోటాలో పైచదువులకు, ఉద్యోగాలకు ఉపయోగపడతాయని వివరించారు. పోటీల్లో పాల్గొనే సైక్లింగ్ రైడర్లు సొంత సైకిళ్లు, ఆధార్ కార్డుతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 7702713139 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తాన్ సింగ్, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ పీడీ, జి.శివకుమార్, పీఈటీలు రేణుక, మీనా కుమారి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయబీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి జన్మదిన వేడుకలు

**వెల్దండ, జూన్ 6 ప్రభాతవార్త:** జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి జన్మదిన వేడుకలను బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై గల మండల పార్టీ అధ్యక్షులు కుర్మిద్ద యాదగిరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచారి పేరుపై ఉన్న కేకును కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ జంగయ్య యాదవ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ మోహన్ రెడ్డి, నాయకులు జులూరి బాలస్వామి, మట్ట విష్ణు గౌడ్, పాండుచారి, శ్రీశైలం ముదిరాజ్, ప్రసాద్‌చారి, గణేష్, శివ, జంగయ్య, శ్రీనివాస్‌చారి, శివచారి, గోవర్ధన్ రెడ్డి, ఆంజనేయులు, రాజు, వెంకటయ్య, సైదులు, చంద్రశేఖర్‌తో పాట తదితరులు ఉన్నారు.

# వర్షాకాలంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నాగార్జున

**ఊర్కొండ, జూన్ 6 ప్రభాతవార్త:**రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేటలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, అభివృద్ధి పనులపై స్థానికులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సర్పంచ్ అబ్దుల్ రషీద్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో, మండల స్థాయి అధికారుల సమక్షంలో ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాల సన్నద్ధత, వరద నిర్వహణ వర్షాకాలంలో తలెత్తే వరద ముప్పును ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, అప్రమత్తతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కలుషిత నీటిని నివారించి, వ్యాధుల బారిన పడకుండా సురక్షిత తాగునీటి ప్రాముఖ్యతను వివరించారు. గ్రామంలోని చెత్తను సక్రమంగా నిర్వహించడం ద్వారా పరిశుభ్రమైన వాతావరణాన్ని కాపాడుకోవాలని కోరారు. ప్రజల సంరక్షణ మన సంరక్షణ నినాదంతో భూగర్భ జలాలను పెంచాలని, మొక్కల పెంపకంలో భాగంగా వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గురించి ప్రజలకు తెలియజేసి, అర్హులైన వారందరూ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ రేపాని శ్రీనివాసులు, సీఐ నాగార్జున, ఎస్ఐ రమాదేవి, ఎంఈవో అబ్దుల్ రహీం,ఏవో దీప్తి, పంచాయతీ కార్యదర్శి ఇబ్రాహీం,వార్డు సభ్యులు,ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మంత్రోనిపల్లిలో మహిళా సమైక్య భవనానికి భూమి పూజ

**ధన్వాడ, జూన్ 6 ప్రభాతవార్త :**ధన్వాడ మండలం మండలంలోని మంత్రోనిపల్లి గ్రామంలో మహిళా సమైక్య భవన నిర్మాణానికి శనివారం ఘనంగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రవికుమార్, ఏపీఎం వెంకటచారి పాల్గొని శుభారంభం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ రవి కుమార్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. మహిళల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు శాశ్వత వేదికగా ఈ భవనం ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామంలో మహిళా సాధికారతకు తోడ్పడేలా ఈ భవనం నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, ఉప సర్పంచ్, మహిళా సంఘ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పాఠశాలల పునఃప్రారంభానికి ముందే మరమ్మతు పనులు పూర్తి చేయాలి

**అధికారులను ఆదేశించిన నారాయణపేట**

**జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక**


నారాయణపేట కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట, జూన్ 6 ప్రభాతవార్త:** జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో పాఠశాలల పునఃప్రారంభానికి ముందే అన్ని మరమ్మతు పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో కేజీబీవీ ప్రత్యేక అధికారులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలోని 11 కేజీబీవీలలో మైనర్ రిపేర్ పనులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని, మేజర్ రిపేర్ పనులను రెండు నెలల్లో పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఉట్కూర్ కేజీబీవీ పాఠశాల ప్రహరీ నిర్మాణానికి సంబంధించిన వివాదాన్ని త్వరితగతిన పరిష్కరించి పనులు ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు అలాగే ఉట్కూర్ కేజీబీవీలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినులు ప్రస్తుతం ఎక్కడ చదువుతున్నారనే వివరాలను సేకరించి అందజేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మద్దూర్, మాగనూరు, మక్తల్ కేజీబీవీల మరమ్మతు పనుల పురోగతిని సమీక్షి ంచిన కలెక్టర్, పాఠశాలల పునఃప్రారంభానికి ముందే అన్ని కేజీబీవీలు, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలను శుభ్రపరిచి, అవసరమైన చోట పెయింటింగ్, ఎలక్ట్రికల్ మరమ్మతులు, తాగునీటి పైప్‌లైన్ పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. రెండు నెలల తర్వాత మరోసారి సమీక్ష సమావేశం నిర్వహిస్తానని, అప్పటికి పూర్తి వివరాలతో హాజరుకావాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జీసీడీవో సంగీత, సాంఘిక సంక్షేమ మరియు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, సెక్టోరల్ అధికారి శ్రీనివాస్, ఇంజినీరింగ్ అధికారులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు అనంతరం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న నిరుపయోగంగా మారిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ దుకాణ సముదాయాన్ని ఆమె పరిశీలించారు మార్కెట్ సముదాయంలోని ఓపెన్ షెడ్లను పరిశీలించి, నిర్మాణ వ్యయం, ప్రారంభం తర్వాత ఎంతకాలం వినియోగంలో ఉందనే అంశాలపై పుర కమిషనర్ శంకర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సముదాయం ప్రస్తుత పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్, సంబంధిత వివరాలను సేకరించి నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు.